# సింగిల్ పేజీ కథలు

## రూల్ ఈజ్ రూల్

"సార్... గ్రూప్ వన్ అప్లికేషన్ ఇవ్వండి... ప్లీజ్..."

ఆ మాటలకి కళ్లజోడు పైనుండి ఓసారి నిశితంగా చూసి మళ్లీ కౌంటర్లో వున్న గోడ గడియారం వంక చూసి టైమింగ్స్ వున్న ఉడెన్ ప్లేట్‌ని తీసి మళ్లీ అదే ప్లేసులో వుంచాడు కౌంటర్ క్లర్క్ జగన్నాథం.

అతని చర్యలు కృష్ణకి అర్థం కాలేదు. అప్లికేషన్ అడిగితే అటూ ఇటూ చూస్తాడేంటి? కొంపదీసి వినిపించ లేదా? కావచ్చు. ఇంకోసారి అడిగాడు.

ఓరి వెర్రినాగన్నా... నా నసుగుడు నీకు అర్థం కాలేదుట్రా అనుకొని "ఈరోజుకి కౌంటర్ క్లోజయ్యింది... రేపురా!" ఏకవచనంతో నిర్లక్ష్యంగా చెప్పి పేపర్లు చూడ్డం మొదలెట్టాడు.

"నాకు ఈ అవర్ లీజర్ సర్... రేపు అస్సలు ఖాళీ లేదు... ప్లీజ్ సర్" రిక్వెస్ట్ చేశాడు.

"కుదర్దు... క్లోజయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ చెయ్యటం అస్సలు కుదర్దు... ఇన్ టైంలో రావాలి గాని మీకు ఎప్పుడు వీలైతే అప్పుడు వచ్చి మా ప్రాణాలు తీస్తే ఎలా? రూల్ ఈజ్ రూల్! ఆమాత్రం తెలీదా?" విసుగ్గా అనేసి మళ్లీ కాయితాల్లో తల దూర్చాడు.

టైం ఓ ఐదు నిముషాలు దాటిందనేగా రిక్వెస్ట్ చేశాను. అయినా ఒక అప్లికేషన్ ఇస్తే ఈయనకి ఉరిశిక్ష పడుతుందేమో అన్నంత భయంగా స్ట్రిక్ట్‌గా రూల్స్ మాట్లాడతాడేంటి? చిన్న ఫేవర్ చేసిపెడితే కోట్ల స్కాంలో కూరుకుపోతాడేమోనన్నంతగా విలవిలలాడిపోతాడేంటి? వెనుతిరుగుతూ అసహనంగా మనసులో అనుకున్నాడు కృష్ణ.

"టక్ చేసుకుని, నెక్ టైలు కట్టుకొని టక్కు టక్కుమంటూ వూపుకుంటూ వస్తే సరా! టైం తెలుసుకోవాలి. రూల్స్ పాటించాలి" వెనుకనుండి జగన్నాథం తల వంచుకొని అన్న మాటలు కృష్ణ చెవిని దాటిపోలేదు.

★ ★ ★

"ఒక డిగ్రీ అప్లికేషన్ ఇవ్వండి సార్"

"టైమైంది... బయట బోర్డ్ చూళ్లేదా? రేపు రండి"

చెంప మీద ఛెళ్లుమన్నట్టనిపించి నివ్వెరపోయాడు జగన్నాథం.

"అరగంట పర్మిషన్ పెట్టి సైకిల్ తొక్కుకుంటూ వచ్చేసరికి కాస్త ఆలస్యం అయింది. ప్లీజ్ సర్... రేపు మాకు ఇన్‌స్పెక్షన్ వుంది. వీలుపడదు సర్. జస్ట్ ఇప్పుడే కదా క్లోజయ్యింది. ప్లీజ్ సర్"

జగన్నాథం రిక్వెస్ట్ వృథాప్రయాసే అయింది.

"మీరు దేనిమీద వచ్చినా నాకు అభ్యంతరం లేదు. మీ ఇన్‌స్పెక్షన్లు, లీజర్ టైమింగ్స్ మీరు చూసుకోవాలి. కాకపోతే ఇన్ టైంలో మాత్రం వచ్చి అప్లికేషన్ తీసుకోవాలి. రూలంటే రూలే కదా!" నిర్లక్ష్యంగా అనేసి పక్క క్లర్క్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

ఆ క్లర్క్ వెటకారానికి, హితబోధకి ఒళ్లంతా కారం రాసుకున్నట్టు భగభగా మండినా జగన్నాథానికి ఒక్క విషయం స్పష్టంగా అర్థమైంది. వాడు తనలాగే బద్ధకస్తుడు, పనిదొంగ. ఏమాత్రం చిన్న అవకాశం దొరికినా పని ఎగ్గొట్టడానికి ముందుంటాడని... తను కూడా కౌంటర్లో చేసేది అదే కదా! వాళ్లు కూడా అప్పుడు ఇలాగే బాధపడి వుంటారేమో కచ్చితంగా. సుఖం అందరిదీ ఒకటి కాదంటారుగానీ బాధ అందరిదీ ఒకటేగా!




ఉసూరుమంటూ వెనుతిరగబోయాడు జగన్నాథం.

"ఆగండి సార్"

పిలిచింది ఆ క్లర్క్ కాదు... ఆ ప్రక్కనే ఇప్పుడో యువకుడున్నాడు. పిలిచింది అతనే... కానీ అతన్నెక్కడో చూసినట్టుంది.

"రామారావుగారూ!... ప్లీజ్ ఒక అప్లికేషన్ ఇవ్వండి. ఆయన నాకు బాగా తెలుసినవారు"

కృష్ణ మాటలకి విస్తుపోయాడు జగన్నాథం.

చిన్న రిలీఫ్ ఫీలయ్యి డబ్బు చెల్లించి అప్లికేషన్ తీసుకున్నాడు.

"నేను తెలుసంటున్నారు. మీరెవరో నాకు గుర్తు రావట్లేదు సార్" గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూ అడిగాడు.

"నేను మీకు గుర్తు లేకపోవచ్చు. మీరు నాకు బాగా గుర్తు వున్నారు"

ఎంతకీ గుర్తురాక "ఎలా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"గ్రూప్ వన్ అప్లికేషన్ కోసం వస్తే కౌంటర్ క్లోజయిందని రూల్స్ ఒప్పుకోవని తిప్పి పంపారు..."///

జగన్నాథానికి గుర్తొచ్చి సిగ్గుతో తల దించుకున్నాడు. అంతేకాదు నీట్‌గా వున్న అతని డ్రెస్‌ని చూసి అసూయగా మాట్లాడినందుకు గిల్టీగా ఫీలయ్యాడు.

"సారీ సర్. మీలాంటివాళ్లని చాలా మందిని రూల్స్ పేరుతో కౌంటర్లో బాధ పెట్టాను. ఆ బాధేంటో ఈరోజు నాకు అనుభవానికొచ్చింది"

"సార్ మనం మామూలు మనుషులం. ఒకరి అవసరం మరొకరికి తప్పక వుంటుంది. అలాగే మనం గవర్నమెంట్ సర్వెంట్స్. ఒకరితో ఒకరికి తప్పక పనిబడుతుంది. మన టైమింగ్స్, రూల్స్ అలా వున్నాయి. దీనికి కొద్దిపాటి హెల్పింగ్ నేచర్ వుంటే చాలు. అలా అని గవర్నమెంట్ విధానాలకి విరుద్ధంగా దాని ఆదాయానికి గండికొట్టే పనులు మనం చేయకూడదు, ప్రోత్సహించకూడదు. రూల్ ఈజ్ రూల్, రూల్ ఫర్ ఆల్. అది ముమ్మాటికీ నిజం. ఇలాంటి చిన్న చిన్న విషయాలని రూల్స్‌తో ముడిపెట్టకూడదు. ఓ ఐదు నిముషాలు వారి కోసం వెచ్చిస్తే, ఓ చిన్న ఫేవర్ చేస్తే గవర్నమెంటు ఆఫీసులంటే వున్న చిన్నచూపు సమసిపోతుంది" చిన్న లెక్చరే ఇచ్చాడు లెక్చరర్ కృష్ణ.

"ఈరోజు నాకు బాగా అర్థమైంది. ఆరోజు మీకు జరిగిన ఇన్‌కన్వీనియన్స్‌కి ఎక్స్‌ట్రీమ్లీ సారీ సర్" మనస్ఫూర్తిగా చెప్పాడు జగన్నాథం.

'అనుభవం నేర్పిన పాఠం అంటే ఇదే కాబోలు' సైకిలు తొక్కుకుంటూ వెళుతున్న ఆయన్ని చూస్తూ అనుకున్నాడు కృష్ణ.

**-కె.విజయలక్ష్మి (బాపట్ల)**